
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



ఇండియా-ఏ ఘన విజయం

దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా-డీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఏ జట్టు ఘన విజయం సాధించింది. 8లో



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.25 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.3°/21.4°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మిలాద్ - ఉన్-నబీని ప్రశాంతంగా జరుపుకోండి



రత్న, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్- ఉన్- నబీ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. జిల్లాలోని ముస్లింలకు మిలాద్- ఉన్- నబీ శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

తేనెటీగల దాడిలో 14 మందికి గాయాలు



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయదుర్గం టౌన్: విందుకు వెళ్లిన ఒకే కాలనీకి చెందిన 14 మంది తేనెటీగల దాడిలో గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణ శివారు ప్రాంతమైన గొందిచెరువు ఏరియాలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గం ఏడో వార్డు సత్యనారాయణస్వామి గుడి ఏరియాలో ఇటీవల వినాయక చవితి వేడుకలు విజయవంతంగా ముగించారు. ఈ సంతోషంలో నిర్వాహకులు 15 మందికి పైగా కలిసి ఆదివారం గొందిచెరువు ఏరియాలో విందు ఏర్పాటు చేసుకున్నారు. భోజనం ముగించుకుని సాయంత్రం నాలుగు గంటలకు ఇళ్లకు వచ్చేందుకు సిద్ధమవుతుండగా ..వారు కూర్చొన్న ప్రాంతంలోని చెట్టు నుంచి తేనెటీగలు ఒక్కసారిగా లేచి దాడి చేశాయి. 13 ఏళ్లలోపు చిన్నారులు గణేష్, చరణ్, రోహిత్, జ్ఞానేష్‌తో పాటు మల్లికార్జున, రమేష్, నాగేష్, శంకర్, అప్పన్న, సురేష్, రాజశేఖర్, మంజునాథ, పి.మంజునాథ, పవన్ గాయపడ్డారు. వీరిలో శంకర్, అప్పన్న, సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరంతా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నీట్-పీజీ ఫలితాల్లో అలేఖ్య సత్తా



ఆర్.అలేఖ్య

తలుపుల : నీట్-పీజీ ఫలితాల్లో రాజనాలవాండ్లపల్లికి చెందిన ఆర్.అలేఖ్య సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 5,294, ఆదివారం వెలువడిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 245వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు ఆర్.వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరిల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంకులు సాధించానని అలేఖ్య తెలిపింది.



మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం

గత జగన్ ప్రభుత్వంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా కట్టలేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించి.. అందులో కొన్ని ప్రారంభించారు. వాటిలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను మంత్రి అడిగి తెలుసుకుంటే మంచిది.

– తిరుపాల్ నాయక్, జిల్లా అధ్యక్షుడు, గిరిజన సంఘం



ప్రజలన్నీ గమనిస్తున్నారు

మంత్రి సత్యకుమార్ చెప్పిన అసత్యాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని సంక్షేమ పథకాలు ఇంటికే చేర్చినా ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా ఇవ్వలేక జగన్‌పై అసత్యాలు వల్లె వేస్తున్నారు. మెడికల కళాశాలలు అన్నీ పూర్తి చేస్తే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే అక్కసుతోనే ఇలా మాట్లాడుతున్నారు.

– బాబుల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, రెడ్డి సంఘం



జూదాల జోరు



ఆంధ్రప్రదేశ్- కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గంలో జూదాలు జోరుగా సాగుతున్నాయి. రోజూ లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇరు రాష్ట్రాల పోలీసుల కళ్లుగప్పి యథేచ్ఛగా జూదాలు సాగిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

- ఏపీ-కర్ణాటక సరిహద్దులో జూద కేంద్రాలు
- కూటమి సర్కారు వచ్చాక విచ్చలవిడి
- రోజూ రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్న పోలీసులు



మడకశిర మండలం ఎం.రంగాపురంలో ఇటీవల పోలీసులకు పట్టుబడిన జూదరులు

మడకశిర: కష్టం తెలీకుండా సులువుగా సంపాదించడానికి కొందరు పేకాటను ఎంచుకుంటున్నారు. ఇటువంటి వారి బలహీనతలను ఆసరా చేసుకుని కొందరు వ్యక్తులు జూద కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మడకశిర నియోజకవర్గం నలు దిశలా ఏపీ-కర్ణాటక సరిహద్దు ఉంది. ఇది జూదకేంద్రాల నిర్వహణకు అనువైనదిగా భావిస్తున్నారు. రెండు రాష్ట్రాల పోలీసుల కంట పడకుండా స్థావరాలు ఎప్పటికప్పుడు మారుస్తూ విజయవంతంగా కేంద్రాలు నడుపుతున్నారు. అంతేకాదు సొంతంగా కొంతమందితో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని.. పోలీసుల సమాచారం తెలుసుకుని అప్రమత్తమవుతుంటారు. ప్రధాన కూడళ్లలో నిఘా (కాపలా)కోసం ఉంచిన వ్యక్తులకు జూద కేంద్రాల నిర్వాహకులు ఒక్కొక్కరికి రోజుకు రూ.1,000 చొప్పున చెల్లిస్తున్నట్లు సమాచారం. తమ వద్దకు వచ్చే పేకాటరాయుళ్లకు జూదకేంద్రాలు మార్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా చేరవేస్తున్నారు.

సకల సౌకర్యాలు అందుబాటులో..

మడకశిర నియోజకవర్గంలోని అగళి, రొళ్ల తదితర ప్రాంతాల్లో నిర్వహించే జూదకేంద్రాలకు పావగడ, మడకశిర, మధుగిరి తదితర ప్రాంతాల నుంచి ఆరితేరిన పేకాటరాయుళ్లు వస్తుంటారు. ఇక్కడ వారి కోసం భోజనం, టీ, కాఫీతో పాటు సకల సౌకర్యాలను నిర్వాహకులు సమకూరుస్తున్నారు. ఈ ఖర్చులన్నింటినీ జూదరుల నుంచి వసూలు చేసుకుంటుంటారు. రోజూ ఇక్కడ లక్షల రూపాయల్లో టర్నోవర్ జరుగుతున్నట్లు సమాచారం.

'కూటమి'తో మరింత జోష్

రాష్ట్రంలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత జూదాలు మరింత పెరిగాయి. ఇందుకు నిదర్శనం పోలీసులు గడిచిన మూడు నెలల కాలంలో నమోదు చేసిన కేసులే. గత ప్రభుత్వ పాలనలో జూదాలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. జూదాలు, ఇసుక, మద్యం అక్రమ రవాణా, మట్కా,గుట్కా తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. దీంతో శాంతి భద్రతలకు ఎక్కడా కూడా భంగం వాటిల్లలేదు.అయితే కూటమి సర్కార్ వచ్చిన తర్వాత జూదాలు పెరగడం ప్రజలకు శాపంగా మారింది.

జూదాలపై ఉక్కుపాదం



జూదాలపై ఉక్కు పాదం మోపుతాం.ఇప్పటికే జూద కేంద్రాలపై దాడులు చేసి రూ.లక్షల్లో నగదును స్వాధీనం చేసుకున్నాం. వందలాది మంది జూదరులను అరెస్ట్ చేశాం. జూద కేంద్రాలను నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. నిరంతర నిఘా ఉంచాం. ప్రజలు కూడా జూదాల నిర్వహణపై సమాచారం అందించి సహకరించాలి. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

–రాజ్‌కుమార్, రూరల్ సీఐ, మడకశిర

జూదకేంద్రాలపై దాడులు.. కేసుల నమోదు

- ✔ జూలై 6న అమరాపురం మండలంలో జూదరులపై కేసులు నమోదు చేసి, రూ.74,710 నగదు స్వాధీనం.
- ✔ ఆగస్టు 11న మడకశిర మండలం ఎల్లోటి వద్ద పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి రూ.1.72 లక్షల నగదు స్వాధీనం.
- ✔ ఈ నెల 3న మడకశిర మండలం ఎం.రంగాపురం వద్ద జూద కేంద్రంపై దాడి చేసి రూ.55,400 నగదు స్వాధీనం.
- ✔ ఈ నెల 1న రొళ్ల మండలం రత్నగిరి వద్ద జూదకేంద్రంపై దాడి చేసి, 38 మందిపై కేసు నమోదు చేసి రూ.1,02,550 నగదు స్వాధీనం.
- ✔ ఈ నెల 7న రొళ్ల మండలం చిగమతిగట్ట వద్ద జూద కేంద్రంపై దాడి చేసి రూ.78,480 నగదు స్వాధీనం.
- ✔ రొళ్ల మండలం రంగనపల్లి, హెచ్‌టీ హళ్లి వద్ద కూడా ఈ నెలలోనే పోలీసులు జూద కేంద్రాలపై దాడులు చేసి రూ.13,200 నగదు స్వాధీనం.

ఐదేళ్లలో ఆర్టీసీకి 5వేల బస్సులు అందిస్తాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్

ధర్మవరం అర్బన్: రానున్న ఐదేళ్లలో ఏపీఎస్ ఆర్టీసీకి ఐదు వేల బస్సులు అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఆదివారం ఆరు నూతన ఆర్టీసీ బస్సు (1 ఆర్టీసీ బస్సు, 5 ఆర్టీసీ అద్దె బస్సులు)లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ ఐదువేల బస్సులు తెప్పించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 1400 ఎలక్ట్రిక్ బస్సుల కోసం టెండర్లు పెట్టామని తెలిపారు. గడిచిన 90 రోజుల పాలనలోనే 600 బస్సులు రోడ్లపై తిరుగుతున్నాయని గుర్తు చేశారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ పేదలు పని నిమిత్తం జిల్లా కేంద్రాలకు వెళుతుంటారని, వారి సౌకర్యార్థం హిందూపురం, కదిరి బస్సులను ఏర్పాటు చేయడం హర్షనీయమని తెలిపారు. వ్యాపార నిమిత్తం చాలామంది బళ్లారికి వెళుతుంటారని, వారి కోసం బళ్లారికి బస్సు, శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనార్థం వెళ్లే భక్తులకు అనుకూలంగాను బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డీఎం సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుఓనం వేడుకలు





'మాయా నాటక సూత్రధారి' నృత్య రూపకంలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: వేలాది మంది కేరళీయులు నడుమ తిరుఓనం వేడుకలు ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ సంస్కృతీ సంప్రదాయాలతో సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. కేరళ బాలవికాస్ చిన్నారులు 'మాయా నాటక సూత్రధారి' నృత్యరూపకం ప్రదర్శించారు. తిరువతిరా కోలాటం, తెయ్యం, మోహినీ అట్టం, కుమ్మట్టి, వల్లంకాలీ, పులికాలీ తదితర నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం కేరళ ఐపీఎస్ అధికారి శ్రీజిత్ ఓనం పర్వదిన వేడుకలు, సత్యసాయి తత్వం గురించి ప్రసంగించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని తరించారు.

రేషన్ బియ్యం.. మాయం

పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలం పోతులకుంట పంచాయతీ మరువకుంటపల్లిలో 27వ నంబరు స్టోర్‌లో ఈ నెల 13వ తేదీనే రేషన్ బియ్యం పంపిణీ ఆపేశారు. ఇదేంటని కార్డుదారులు ప్రశ్నిస్తే స్టాక్ అయిపోయిందని డీలరు సమాధానం చెప్పారు. సుమారు 15 మందికి బియ్యం అందాల్సి ఉంది. దీనిపై అధికారులను వివరణ కోరగా.. తక్కువ సరఫరా అనే పరిస్థితే లేదని చెప్పడంతో డీలరుపై లబ్ధిదారులు తిరగబడ్డారు. చేసేదిలేక అందరికీ పంపిణీ చేశారు.



జిల్లా గణాంకాలు	
రేషన్ దుకాణాలు	1,367
బియ్యం కార్డులు	5,62,784
నెలసరి కోటా బియ్యం	8,700 మెట్రిక్ టన్నులు

- పేదలకు స్టోర్ డీలర్ల మొండిచెయ్యి
- చాలా గ్రామాల్లో తప్పని అవస్థలు
- స్టాక్ లేదు.. రాలేదంటూ సమాధానం
- పంచదార, కందిపప్పు, గోధుమ పిండి లేవు
- గుట్టుచప్పుడు కాకుండా నల్లబజారుకు బియ్యం

సాక్షి, పుట్టపర్తి: పేదల బియ్యం.. టీడీపీ కార్యకర్తలకు వ్యాపారంగా మారింది. కార్డుదారులకు అందజేయకుండా నేరుగా నల్ల బజారుకు తరలిస్తున్నారు. ఒక కోటా ఇచ్చి.. తర్వాతి నెలలో పక్కకు తరలిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వెలుగు చూస్తున్నాయి. కార్డుదారులు సకాలంలో రాకున్నా.. స్టోర్ తెరిచి ఉన్న సమయంలో రావాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో ఏ సమయంలో షాపు ఉంటుందో.. ఎప్పుడు మూసేస్తారో..? తెలీక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గడువు కంటే ముందే స్టాక్ లేదని చేతులెత్తేస్తున్నారు. దీంతో వేల సంఖ్యలో లబ్ధిదారులకు చౌకబియ్యం అందని ద్రాక్షగా మారింది. కాగా స్టోర్ నుంచి నేరుగా.. బ్లాక్ మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటకలో పాలిష్ చేయించి.. సన్నబియ్యం పేరుతో చేసి కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బియ్యం బదులు నగదు ఇస్తామని..

కొన్ని గ్రామాల్లో బియ్యం బదులు కిలోకు రూ.10 చొప్పున నగదు ఇచ్చి కార్డుదారుల నోర్లు మూయిస్తున్నట్లు తెలిసింది. కొందరు బియ్యం కావాలని డిమాండ్ చేసినా.. వచ్చే నెలలో ఇస్తామని చెబుతున్నారు. ఈ నెలలో ఆలస్యంగా వచ్చారని.. ఏదో సాకుతో బియ్యం ఇవ్వకుండా దబాయిస్తున్నారు. డీలర్ల నుంచి కిలో బియ్యం రూ.15 పైగా చెల్లించి వ్యాపారులు తీసుకెళ్తారు. గ్రామాల్లో బ్లాక్ పాయింట్లలో నిల్వ చేసి.. ఏదో ఒక రోజు ఉన్నఫలంగా వాహనంలో ఎక్కించి సరిహద్దు దాటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా గ్రామాల్లో లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందడం లేదు.

అక్రమార్జనే ధ్యేయంగా

పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యం పథకం అమలు చేస్తోంది. ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే కొందరు కూటమిలోని టీడీపీ నేతలు అక్రమార్జనే ధ్యేయంగా పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. స్టోర్ డీలర్లతో కుమ్మక్కై కొనేస్తున్నారు. బియ్యం కోసం వచ్చిన కార్డుదారులకు అరో..పాతికో ఇచ్చి నోర్లు మూయిస్తున్నారు. గట్టిగా అడిగితే కార్డు లేకుండా చేస్తామని బెదిరిస్తున్నారు. స్టోర్ డీలర్లందరూ టీడీపీ నేతల అండదండలతో కొనసాగుతున్న వారే.

గడచిన ఐదేళ్లు ప్రశాంతం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న ఐదేళ్లపాటు కార్డుదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేశారు. అంతేకాకుండా పంచదార, గోధుమపిండి, చక్కెర అందజేశారు. అనంతరం ఇంటింటికీ రేషన్ సరుకుల పథకంలో భాగంగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు వచ్చేవి. కాగా ప్రస్తుతం ఎండీయూ వాహనాలను రద్దు చేశారు. స్టోర్ దగ్గరకు వెళ్లినా.. పదే పదే తిప్పుకొంటూ.. చివరి రోజున బియ్యం ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కక్షసాధింపు చర్యలు చేపట్టినట్లు అర్థం అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

గుడ్డూ.. బ్రెడ్డూ..





దులీప్ ట్రోఫీ మ్యాచులు ఆడటానికి వచ్చిన క్రికెటర్లకు అందించే ఆహార పదార్థాలు..

- అల్పాహారంలో ప్రొటీన్ ఫుడ్డుకే క్రికెటర్ల ఓటు
- మెనూలో కనిపించని మటన్ బిరియానీ
- ప్రతిరోజు బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు, బ్రెడ్ ఆమ్లెట్, మొలకెత్తిన గింజలు
- మధ్యాహ్నం, రాత్రిపూట రెండు, మూడు రకాల చికెన్ వంటకాలు
- సౌతిండియన్ వంటకాలపై ఆసక్తి



ఆర్డీటీ క్రీడాగ్రామంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఓ దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉదయం ఆరు గంటలకే లేచి రెండు గంటల పాటు జిమ్ చేయాలి. ఆట లేని రోజు ప్రాక్టీస్ ఉంటుంది. మ్యాచ్ ఉంటే రోజులో కనీసం ఎనిమిది గంటల పాటు గ్రౌండ్‌లోనే గడపాలి. ఇదీ దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచులు ఆడటానికి అనంతపురానికి వచ్చిన క్రికెటర్ల షెడ్యూలు. మంచి ఫిట్‌నెస్‌తో ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. అందువల్లే క్రికెటర్లు నూనెల్లో మునిగితేలిన ఆహారం, బాగా వేపిన కూరలు వంటివి ఏ మాత్రమూ తీసుకోవడం లేదు. ప్రస్తుతం అనంతపురంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల్లో ఆడుతున్న వారిలో చాలా మంది అంతర్జాతీయ ప్లేయర్లే. రింకూసింగ్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, మయాంక్ అగర్వాల్, సంజు శాంసన్, అర్షదీప్ సింగ్, తిలక్‌వర్మ, వాషింగ్టన్ సుందర్, రుతురాజ్ గైక్వాడ్ లాంటి పలువురు ఆటగాళ్లు ఉన్నారు. వీళ్లు తీసుకునే ఆహారం ఎలా ఉందోనని క్రికెటర్లు బస చేస్తున్న మాసినేని హోటల్‌లో 'సాక్షి ప్రతినిధి' పరిశీలించగా..ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.

వెరీ'గుడ్డు'..

కోడిగుడ్డు..పోషకాహారానికి పెట్టింది పేరు. మెజారిటీ ప్లేయర్లు ఉడకపెట్టిన గుడ్డు తీసుకుంటున్నారు. అలాగే చాలామంది బ్రెడ్డు ఆమ్లేట్ ఇష్టపడుతున్నారు. గుడ్డు ఆమ్లేట్ వేసుకుని దాన్ని బ్రెడ్ మధ్యలో పెట్టి తింటున్నారు. సగం ఉడికిన అంటే హాఫ్ బాయిల్డ్ ఎగ్‌ను కూడా ఇష్టపడుతున్నారు. ఉడకబెట్టిన కూరగాయలు, శాండ్‌విచ్‌లు కూడా ఎక్కువగా తీసుకుంటున్నారు. మొలకెత్తిన పెసలు, ఉడకబెట్టిన శనగలు అల్పాహారంలో భాగంగా ఉంటున్నాయి. ఇవి ప్రతిరోజూ అల్పాహార మెనూలో ఉండాలనే నిబంధన ఉంది. మ్యాచ్ ఆడేటప్పుడు కడుపులో ఎలాంటి అలజడి ఉండకూడదు. ఇందుకు కూరగాయలే అన్నిటికంటే మంచివి. అందుకే క్యారెట్, క్యాలీఫ్లవర్, లేత కార్న్ కంకులు, ఆలూ వంటి కూరగాయలను ముక్కలుగా కోసి ఉడకబెట్టినవి ఎక్కువగా తీసుకుంటున్నారు.

ఓన్లీ చికెన్.. నో మటన్..

క్రికెటర్లకు మటన్ బిరియానీలు, కబాబ్‌లు వంటివి దూరంగా పెట్టారు. మధ్యాహ్నం, రాత్రిపూట ప్రొటీన్ కోసం చికెన్ వంటకాలు మాత్రమే చేస్తున్నారు. కొన్ని నార్త్ ఇండియన్ , కొన్ని సౌత్ ఇండియన్ చికెన్ వంటకాలు మెనూలో ఉంచారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే మటన్ బిరియానీ, చిప్స్ వంటివాటిని మెనూలో పెట్టలేదు. కూల్‌డ్రింక్స్ కూడా దగ్గరకు రానివ్వడం లేదు. పూర్తిగా చికెన్, గుడ్డు రూపంలోనే ప్రొటీన్ వంటకాలు ఇస్తున్నామని మాసినేని హోటల్ చెఫ్స్ తెలిపారు. క్రికెటర్లు ఉదయం ఆరున్నర గంటల నుంచి 8 గంటలలోపు అల్పాహారం తినేసి గ్రౌండ్‌కు వెళుతున్నట్టు బీసీసీఐ ప్రతినిధులు తెలిపారు.

ఇడ్లీ, చట్నీపై మక్కువ..



ఆంధ్రా ఇడ్లీ అంటే మక్కువ చూపించని వారు ఎవరూ ఉండరు. ప్రస్తుతం దులీప్‌ట్రోఫీ ఆడుతున్న వారిలో చాలామంది ఉత్తరాది క్రికెటర్లే. అయినా సరే మెత్తని రవ్వ ఇడ్లీని పప్పుల పొడి, వేరుశనగ చట్నీతో ఆరగిస్తున్నారు. ఎక్కువ మోతాదులో కాకుండా ఒకటి లేదా రెండు ఇడ్లీలు అల్పాహారంలో తీసుకుంటున్నారు. టమాటా బాత్, సాంబార్ మెనూలో చేర్చడంతో వీటినీ టేస్ట్ చేస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి

బత్తలపల్లి: ఇంటి ముందు రస్తా సమస్యపై ఆదివారం వైఎస్సార్‌సీపీ వర్గీయుల ఇంటిపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఘర్షణలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ మధ్య కొంత కాలంగా ఇంటి ముందు రస్తా సమస్యపై వివాదం నెలకొంది. ఈ నెల 12న శ్రీనివాసులు తన పొలంలో పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకుని ఇంటి ఎదుట రస్తాలోకి నీరు వస్తోందని గొడవ పెట్టుకున్నాడు. వర్షపు నీరు వస్తే తానేమి చేయాలంటూ శ్రీనివాసులు సమాధానమివ్వడంతో లక్ష్మీనారాయణ రెచ్చిపోయి తన పార్టీకి చెందిన కార్యకర్తలను సమీకరించుకున్నాడు. దీంతో తమపై దాడి చేసే అవకాశముందని భావించిన వైఎస్సార్‌సీపీ వర్గీయులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. అయితే టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తనపై హత్యాయత్నం చేశారంటూ ఫిర్యాదు చేశాడు. లక్ష్మీనారాయణ తీరు అనుమానాస్పదంగా ఉండడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు వచ్చిన తర్వాత మాట్లాడుదామని, అప్పటి వరకూ గ్రామంలో ఎలాంటి గొడవలకు తావివ్వరాదని నచ్చచెప్పి పంపేశారు. ఆదివారం ఉదయం పోలీసుల నుంచి సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు స్టేషన్‌కు బయలుదేరారు. వారంతా అటు వెళ్లిన తరువాత టీడీపీ వర్గీయులు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను మూడు సుమోల్లో రప్పించుకుని ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న శ్రీనివాసులపై దాడికి తెగబడ్డారు. ఈ విషయం తెలియగానే ఆయన వర్గీయులు వెనక్కు వచ్చే లోపు టీడీపీ నాయకులు అక్కడి నుంచి ఉడాయించారు. అప్పటికే దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీకి చెందిన అరవింద్, లక్ష్మీదేవమ్మ, వెంకటరాముడు, టీడీపీ వర్గీయులు లక్ష్మీనారాయణ, అభిలాష్‌ను ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గేదెల దొంగల పట్టివేత

తాడిపత్రి రూరల్: మండలంలోని తేరన్నపల్లి క్రాస్ వద్ద గేదెలను అపహరించుకెళుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన పరమేష్, మనోహర్‌కు చెందిన మూడు గేదెలు అపహరణకు గురయ్యాయి. దీనిపై బాధిత పాడి రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఓ గేదెను తోలుకెళుతున్న తాడిపత్రి మండలం వంగనూరుకు చెందిన బొగ్గుల బాబు, గోగుల మారుతి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. తాము అపహరించిన గేదెల్లో రెండింటిని కర్నూలు జిల్లా డోన్‌లో జరిగిన సంతలో రూ.లక్షకు విక్రయించినట్లు వారు అంగీకరించారు. మరో గేదెను అనంతపురంలో జరిగే సంతలో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లుగా వివరించారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచబోతున్నట్లు పోలీసులు తెలిపారు.



సత్యం మాట్లాడడం నేర్చుకో...

ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు పూర్తి అర్థరహితం. ఆయన సత్యం మాట్లాడడం అలవాటు చేసుకోవాలి. మాజీ సీఎం జగనన్న హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో ఐదు ఇప్పటికే ప్రారంభం కాగా, ఈ ఏడాది మరో ఐదింటిని, వచ్చే ఏడాది 7 కళాశాలలను ప్రారంభించేలా నిర్మాణాలు చేస్తూ వచ్చారు. ఇంతలో కూటమి ప్రభుత్వం వచ్చింది. నిర్మాణాలు పూర్తయిన కళాశాలలను ప్రారంభించకుండా విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు. అంతేకాక కళాశాలలు వద్దు, సీట్లు కుదించాలని ఎన్ఎంసీకి లేఖ రాయడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా వాస్తవాలు బహిర్గతం చేసి, పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలి.

– కుంటాల పుల్లయ్య, సర్పంచ్, రామాపురం, తాడిమర్రి మండలం



అవాస్తవాలు వద్దు

మా అన్న కుమారుడు కోచింగ్ తీసుకుని నీట్ పరీక్ష రాశాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలుండి ఉంటే ఇప్పుడు సీటు వచ్చి ఉండేది. పెనుకొండలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిలిపి వేయడం దారుణం. వైఎస్ జగన్‌కు మంచి పేరు రాకూడదనే ఉద్దేశపూర్వకంగా పనులను సీఎం చంద్రబాబు ఆపించి కుట్ర రాజకీయాలు చేయడం దారుణం. దీనికి మంత్రి సత్యకుమార్ వత్తాసు పలుకుతూ పులివెందుల మెడికల్ కళాశాలలో వసతులపై అవాస్తవాలు ప్రచారం చేయడం బాధాకరం.

– నరసింహమూర్తి, హరేసముద్రం, మడకశిర మండలం



స్మాష్‌లతో అదరగొట్టి...

- షటిల్‌లో రాణిస్తున్న కదిరి విద్యార్థులు
- చిరు ప్రాయంలోనే జాతీయ స్థాయి విజేతలుగా ఖ్యాతి

కదిరి టౌన్: పట్టుమని పదహైదేళ్ల వయసు కూడా లేని ఆ కుర్రాళ్లు... షటిల్‌లో తమకు ఎదురు లేదని నిరూపించారు. రాకెట్ పట్టుకుని కోర్టులో దిగితే స్మాష్‌లతో ప్రత్యర్థి క్రీడాకారుడిని ముప్పు తిప్పలు పెట్టేస్తున్నారు. పతకాలు, షీల్డ్‌లు, కప్పులతో ఇంటికి చేరుకుంటున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న కదిరి ప్రాంత విద్యార్థులు విజయ ప్రస్థానంపై కథనం.

స్ప్లిట్–స్టెప్ ఛాలెంజ్‌లో తిరుగు లేదని

కదిరి పట్టణానికి చెందిన అంగజాల నాగభూషణ కుమారుడు హర్షిత్ వెంకటసాయి స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. వయస్సు నాలుగున్నరేళ్లే... షటిల్ కోర్టులో అడుగు పెడితే ప్రత్యర్థి క్రీడాకారుడిని ముప్పు తిప్పలు పెట్టడంలో దిట్టగా ఖ్యాతి గాంచాడు. కోచ్ నాగభూషణ్ వద్ద ఆట నేర్చుకోవడం మొదలు పెట్టిన ఆరు నెలల్లోనే స్ప్లిట్–స్టెప్ ఛాలెంజ్‌లో తనకు తిరుగు లేదని నిరూపించుకున్నాడు. 2018 జూన్‌లో తాలూకా స్థాయి షటిల్ టోర్నీలో పాల్గొన్న హర్షిత్ వెంకటసాయి అండర్–08 సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రన్నరప్‌ను సాధించాడు. హర్షిత్‌లోని క్రీడాకారుడుని గుర్తించిన జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ కిట్‌ను ప్రదానం చేశారు. 2018 జూలైలో అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ టోర్నీలో అప్ కమింగ్ ప్లేయర్ అవార్డు దక్కించుకున్నాడు. అండర్–10 విభాగంలో సింగల్, డబుల్స్ రన్నరప్‌ను కైవశం చేసుకున్నాడు. 2019 ఫిబ్రవరిలో బెంగళూరు వేదికగా జరిగిన షటిల్ టోర్నీలో జాతీయ స్థాయి రన్నరప్‌ను దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో బెస్ట్ పర్‌పార్మింగ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. అండర్–9 విభాగంలో జాతీయ స్థాయి విజేతగా, అండర్ 11లో జిల్లా స్థాయి విజేతగా, అండర్ –15లో డబుల్స్ విజేతగా పలు షీల్డ్‌లు అందుకున్నాడు.



తాను అందుకున్న షీల్డ్‌లతో హర్షిత్ వెంకటసాయి

'ప్రైటెన్షన్'తో దృష్టి ఏమార్చి

కదిరి పట్టణానికి చెందిన వీఆర్వో విజయ్‌కుమార్ కుమారుడు సామె మురారీ వెంకట్.. స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి కరాటే, డ్యాన్స్‌తో పాటు షటిల్ బ్యాడ్మింటన్‌పై మక్కువతో ఆయా అంశాల్లో సాధన చేస్తూ వచ్చాడు. ప్రైటెన్షన్–స్ప్లిట్ స్టెప్‌తో కోర్టులో శరవేగంగా కదులుతూ ప్రత్యర్థి క్రీడాకారుడి దృష్టిని ఏమార్చి విజయాన్ని సొంతం చేసుకోవడంలో మంచి నైపుణ్యం గడించాడు. 2018లో అనంతలో జరిగిన షటిల్ టోర్నీలో అండర్–10లో రన్నరప్‌ను దక్కించుకున్నాడు. అండర్ 15, 17 ఉమ్మడి జిల్లా షటిల్ టోర్నీలో విజేతగా నిలిచాడు. 2023, 2024లో అండర్–14 విభాగంలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజేతగా నిలిచాడు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన అండర్–14 జాతీయ స్థాయి టోర్నీలో ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇతను కూడా కోచ్ నాగభూషణ్ శిష్యుడే కావడం గమనార్హం.



బంగారు పతకాన్ని చూపుతున్న మురారీ వెంకట్

బ్యాక్ హ్యాండ్ స్ట్రోక్‌తో చిత్తు

కదిరి పట్టణానికి చెందిన కాటమ్ కిరణ్ కుమారుడు ఈశ్వర్ సాయి చిన్నప్పటి నుంచి కరాటే, డ్యాన్స్‌తో పాటు షటిల్ కూడా నేర్చుకున్నాడు. బ్యాక్ హ్యాండ్ స్ట్రోక్‌లతో ప్రత్యర్థి క్రీడాకారుడిపై ఆధిపత్యం సాధిస్తాడు. 2019 మార్చిలో బెంగళూరు వేదికగా కర్ణాటక స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీ అండర్–8 విభాగంలో రన్నరప్‌ను సాధించాడు. ఆ సమయంలోనే ఇతనిలోని క్రీడాప్రతిభను గుర్తించి బెస్ట్ అప్ కమింగ్ ప్లేయర్‌గా అవార్డును అందజేసి కర్ణాటక స్పోర్ట్స్ అకాడమీ సత్కరించింది. 2023, 2024లో ఒడిశాలో జరిగిన జాతీయ స్థాయి అండర్–14 విభాగం విజేతగా నిలిచాడు.



విన్నర్ కప్, ప్రశంసాపత్రాన్ని చూపుతున్న కాటమ్ ఈశ్వర్‌సాయి

బంగారు దుకాణంలో నగదు అపహరణ

పెనుకొండ: బంగారు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి జేబులో నుంచి నగదు అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు... రొద్దం మండలం బూచర్ల గ్రామానికి చెందిన శ్రీరాములు ఆదివారం ఉదయం తన కుటుంబసభ్యులతో కలసి పెనుకొండలోని ఒక బంగారు దుకాణంలో నగలు కొనుగోలు చేయడానికి వెళ్లారు. బేరం కుదిరిన అనంతరం డబ్బు తీసి ఇచ్చేందుకు జేబులో చెయ్యి పెడితే ఖాళీగా కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన శ్రీరాములు జరిగిన విషయాన్ని దుకాణ యజమానికి తెలపడంతో ఆయన వెంటనే సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించాడు. అందులో నగలు పరిశీలిస్తున్న సమయంలో శ్రీరాములు పక్కనే నిలబడిన గుర్తు తెలియని వ్యక్తి ఓ ప్లాస్టిక్ కవర్‌ను అడ్డుగా పెట్టుకుని నగదు కాజేస్తున్న దృశ్యాలు కనిపించాయి. రూ.4,500 నగదును దుండగుడు అపహరించుకెళ్లినట్లుగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాష్ట్ర ఖోఖో జట్టులో చోటు

జె.పంగులూరు: ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరు కాగా, రాష్ట్ర జట్టులో అనంతపురానికి చెందిన పి.జ్యోతిరామ్, ఎ.స్వప్నకు చోటు దక్కింది.

'సమగ్ర' ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

- జేఏసీ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. చిరుద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. జేఏసీ నాయకుడు ఓబుళరెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ రాయలసీమ ప్రాంతీయ సదస్సు జరిగింది. సదస్సుకు ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ రీ–ఆర్గనైజేషన్ వ్యవహారంలో సమగ్రంగా చర్చించాకే ప్రభుత్వం ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. అగ్రిమెంట్ బాండ్ విధానం రద్దుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చిరుద్యోగులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఈ దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఇప్పటి వరకూ తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమానం వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, సీఐటీయూ అధ్యక్షురాలు నాగమణి, జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.నాగరాజు, సురేష్‌వర్మ, నాగరాజు, మాధవ్, శంకరయ్య, నరసింహమూర్తి, నూర్ మహమ్మద్, , ఉద్యోగులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఇండియా–ఏ ఘన విజయం



సెంచరీ చేసి అభివాదం చేస్తున్న రికీ భుయి





స్టేడియంలో అభిమానుల సందడి

- రికీ భుయి సెంచరీ వృథా
- ఇండియా–డీకి వరుసగా రెండో ఓటమి

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడా గ్రామం ప్రధాన మైదానంలో జరిగిన నాలుగు రోజుల మ్యాచులో ఇండియా–ఏ జట్టు ఘన విజయం సాధించింది. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని ఇండియా–డీ జట్టు వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. తెలుగు తేజం రికీ భుయి అద్భుత సెంచరీ (195 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 పరుగులు) సాధించినప్పటికీ ఇండియా–డీని ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. 488 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోరు 62/1తో చివరిరోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా–డీ జట్టు 301 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 186 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. సెంచరీ హీరో రికీ భుయ్‌కి జట్టులోని ఏ ఒక్క ఆటగాడి నుంచి మంచి సహకారం లభించలేదు. సంజూ శాంసన్ (40), శ్రేయస్ అయ్యర్ (41), యశ్ ధూబే (37)లకు మంచి ఆరంభాలు లభించినా.. భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇండియా–ఏ ఆల్‌రౌండర్ సామ్స్ ములానీ (89 పరుగులు, 4 వికెట్లు)కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా.. రికీ భుయికి ఇది 19వ ఫస్ట్‌క్లాస్ సెంచరీ. అత్యధిక సెంచరీలు సాధించిన తొలి ఆంధ్రా క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.



సామ్స్ ములానీ



అన్షుల్ కాంభోజ్

ఇండియా–సీ, బీ మ్యాచ్ డ్రా

అనంత క్రీడా గ్రామం రెండో మైదానంలో ఇండియా–బీ, ఇండియా–సీ జట్ల మధ్య జరిగిన దులీఫ్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 309/7తో చివరిరోజు ఆట కొనసాగించిన ఇండియా–బీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 108 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఇండియా–సీకి 193 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇండియా–బీ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 286 బంతుల్లో 157 (14 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశాడు. అనంతరం ఇండియా –సీ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 128/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 62 , రజిత్ పటిదార్ 42 పరుగులు చేశారు. ఇండియా–బీ బౌలర్లలో రాహుల్ చహర్ 2, ముకేష్ కుమార్, ముషీర్‌ఖాన్ చెరో వికెట్ తీశారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచును డ్రాగా ముగించారు. 27.5 ఓవర్లలో 69 పరుగులు ఇచ్చి 8 వికెట్లు తీసిన ఇండియా–సీ బౌలర్ అన్షుల్ కాంభోజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన అతను దులీప్ ట్రోఫీలో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసిన ఐదో బౌలర్‌గా నిలిచాడు. అదే విధంగా మూడో పేసర్ కావడం గమనార్హం. హర్యానాకు చెందిన కాంభోజ్ ముంబై ఇండియన్స్ తరపున ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన వారికి అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అవార్డులను అందజేశారు.

సంక్షిప్త స్కోర్లు..

ఇండియా–ఏ:	తొలి ఇన్నింగ్స్ 290, రెండో ఇన్నింగ్స్ 380/3 (డిక్లేర్డ్)
ఇండియా–డీ:	తొలి ఇన్నింగ్స్ 183, రెండో ఇన్నింగ్స్ 301
ఇండియా–సీ:	తొలి ఇన్నింగ్స్ 525, రెండో ఇన్నింగ్స్ 128/4 (డిక్లేర్డ్)
ఇండియా–బీ:	తొలి ఇన్నింగ్స్ 332

• అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రొళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న వారందరూ ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 24 ఏళ్ల తర్వాత కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువుల సేవలను కొనియాడారు. నాటి ఉపాధ్యాయులు భోజేగౌడ్, బసవరాజు, భాస్కర్, గోవిందరావు, శ్రీనివాసులు, గంగప్ప, ఈరన్న, హనుమంతరాయప్ప, శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్రరావు, మహదేవప్ప తదితరులను ఘనంగా స,న్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శకంగా...

- ఆదర్శప్రాయం.. మహమ్మద్ ప్రవక్త జీవితం



మదీనా నగరంలోని ప్రవక్త సమాధి ఉన్న మసీదు

రాయదుర్గం టౌన్: 'సమాజంలో నెలకొన్న చీకట్లను చీల్చే సూర్యుడిలా వందల ఏళ్ల క్రితమే అభ్యుదయ భావాలతో ఉదయించి సమస్త మానవాళికి మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు అల్లా ప్రవక్త (దేవదూత) మహమ్మద్(స) మార్గం అందరికీ అనుసరణీయంగా మారింది. ఇస్లాంను విశ్వవ్యాప్తం చేసిన వారిలో చివరి ప్రవక్తగా ఖ్యాతిగాంచిన మహమ్మద్(స) పుట్టిన రోజును మిలాద్–ఉన్–నబీగా ముస్లింలు ఆచరిస్తున్నారు.

ఆధ్యాత్మికత.. తాత్విక చింతన..

శాంతి, ధర్మం, సమానత్వం, తోటి వారి పట్ల ఎలా మెలగాలో బోధించిన మహమ్మద్ ప్రవక్త.. పరిపూర్ణ ఆధ్యాత్మికతకు, తాత్విక చింతనకు మారుపేరుగా నిలిచారు. అల్లా సందేశాలను తొలుత ఆయన ఆచరించిన తర్వాతనే ఇతరులకు ప్రభోదించేవారు. వందల ఏళ్ల క్రితం ఆ రోజుల్లో అరేబియా, ఇతర దేశాల్లో మహిళల స్థితిగతులు దారుణంగా ఉండేవి. అలాంటి తరుణంలో వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకోవచ్చునని, ఇరుగు పొరుగు, తల్లిదండ్రులు, కట్టుకున్న భార్యతో ఎలా మెలగాలి అనే అంశాలపై ప్రజలను మహమ్మద్ చైతన్య పరుస్తూ వచ్చారు. తన 40వ ఏటా ప్రవక్తగా అవతరించారు. అల్లాహ్ దూత జిబ్రయిల్ అలే సలాం నుంచి సందేశం అందుకున్న ఆయన సగటు మనిషి సన్మార్గంలో ఎలా జీవించాలి, అల్లాహ్ అనుగ్రహం ఎలా పొందాలో స్పష్టం చేశారు. 63 ఏళ్ల పాటు అల్లా చూపిన మార్గంలో నడుస్తూ ఆదర్శవంతమైన జీవితం గడిపిన మహమ్మద్ ప్రవక్త... రబ్బి–ఉల్–అవ్వాల్ (ఇస్లామిక్ క్యాలెండర్‌లోని మూడో నెల) స్వర్గస్తులయ్యారు.

ప్రత్యేక ప్రార్థనలు, జలూస్ కార్యక్రమాలు..

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని (మిలాదున్ నబీ) పురస్కరించుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని అన్ని మసీదుల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రవక్త జీవిత చరిత్రపై మౌలానాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సోమవారం ఉదయం జూలూస్ పేరుతో మక్కా, మదీన నమూనాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు.

ప్రవక్త జీవితం ఆచరణీయం



మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించిన మహనీయుడిగా మహమ్మద్ ప్రవక్తకు పేరుంది. ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే మనిషి జీవితానికి సార్థకత ఉంటుంది. ఆయన జీవితాన్ని అనుసరిస్తే అల్లాహ్ కరుణ సాధ్యపడుతుంది. తల్లిదండ్రులను గౌరవించడం, ఇస్లామిక్ ధర్మ సూత్రాలు ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్రలు తప్పనిసరిగా పాటించాలి.

– మహమ్మద్ సైపుల్లా, ప్రభుత్వ ఖాజీ, రాయదుర్గం

ఆస్పత్రి ఏర్పాటుకు స్థల పరిశీలన

గోరంట్ల: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పాలసముద్రం సమీపంలో ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే అధికారులు ఎంపిక చేసిన స్థలాన్ని మంత్రులు సవితమ్మ, సత్యకుమార్ ఆదివారం పరిశీలించారు. సర్వే నంబర్ 130–2లో ఎకరా పైగా ఉన్న ప్రభుత్వ భూమిని రెడ్‌క్రాస్ సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ భూమిలో ఆస్పత్రితో పాటు బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సొసైటీ చర్యలు తీసుకుంది. జాతీయ రహదారి పక్కనే ఆస్పత్రి ఏర్పాటైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ అన్నారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న బంగి విజయ్‌కుమార్ (23) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తాను ప్రేమించిన మేనమామ కుమార్తెతో పెళ్లికి అమ్మాయి తరఫు పెద్దలు నిరాకరించారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న విజయ్‌కుమార్ ఈ నెల 13న గుత్తి రోడ్డులోని ఓ హోటల్ వెనుక పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడిని స్థానికులు గుర్తించి వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఈ నెల 14న మృతి చెందాడు. ఘటనపై అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడి తండ్రి మరాటి సురేష్... కక్కలపల్లి నివాసి. ప్రస్తుతం ఆయన బెంగళూరులో ఉంటున్నారు.